రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- అట్టహాసంగా డోన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం
- షాపింగ్ కాంప్లెక్స్ పనుల ప్రారంభం





మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు, షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

డోన్: రాష్ట్రంలో రాజన్న రాజ్యం ఏర్పాటుకై రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ఇప్పటికే అనేక రాయితీలు, సౌకర్యాలు కల్పించిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ప్యాపిలి మాజీ జెడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన యార్డు కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి బుగ్గన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వంచే నామినేటెడ్ చేయబడిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులచే మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి యార్డు సెక్రటరీ ఆదినారాయణ సహకరించారు. యార్డు చైర్మన్‌గా రాజా నారాయణమూర్తి, వైస్‌చైర్మన్‌గా గొల్ల భారతి, డైరెక్టర్లుగా నీలకంటి విజయలక్ష్మి, దిగురిపాటి లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, శికినిగోయిన వేణు, మంటిపెద్ద మద్దయ్య, పెద్దవాణి శివమ్మ, గొల్ల వెంకటేశ్వర్లు, గాడమూరి రవికుమార్, హరిజన మద్దమ్మ, కాట్రోతి లక్ష్మనాయక్, చంద్రశేఖర్ రెడ్డి, హరికృష్ణ, ఆర్వేటి ఇంద్రావతితో పాటు వివిధ వర్గాలకు చెందిన మరో నలుగురు పాలకవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

అన్ని వర్గాల వారికి సమన్యాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమన్యాయం, సమపాలన అనే ప్రాతిపదికన సమాజంలోని అన్నివర్గాల వారికి నామినేటెడ్ పదవులతో పాటు ఇతర పదవులను కట్టబెట్టడం జరిగిందని మంత్రి బుగ్గన అన్నారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో గత పాలకులు అన్ని మతాలు, కులాల వారీగా ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించారని గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమన్యాయం, సమపాలన అనే ప్రాతిపదికన సమాజంలోని అన్నివర్గాల వారికి నామినేటెడ్ పదవులతో పాటు ఇతర పదవులను కట్టబెట్టడం జరిగిందన్నారు. కులం, మతం, వర్గ విబేధాలకు తావు లేకుండా కష్టించి పనిచేసిన పార్టీ కార్యకర్తలందరికీ సముచితమైన పదవులను కట్టబెడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాష్ట్రస్థాయి పదవులు లభించాయని గుర్తుచేశారు.

ఆర్యవైశ్యులకు అగ్రస్థానం

డోన్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించి గతంలో ఎమ్మెల్యేలుగా, ఉప ముఖ్యమంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారందరూ ఆర్యవైశ్యులను రాజకీయంగా కరివేపాకులా వాడుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం డోన్ మునిసిపల్ వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తిలతో పాటు పలు నామినేటెడ్ పదవులలో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించామని చెప్పారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన కోటి రూపాయలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, డోన్, ప్యాపిలి జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, శివరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



నూతన రహదారిపై గ్రామస్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండపరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామానికి రూ. 42 లక్షలతో పూర్తైన నూతన రహదారిని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి నూతన రహదారిపై పాదయాత్ర చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుగ్గన మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం డోన్ నియోజకవర్గం నుంచి మాతాత బీపీ శేషారెడ్డి ఎమ్మెల్యేగా సేవలు అందించారన్నారు. ఆ తరువాత మీ అందరి ఆశీర్వాదంతో 2014, 2019 ఎమ్మెల్యేగా ఎన్నికై ఆర్థిక మంత్రి బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డోన్ నియోజకవర్గంలో తీవ్రమైన తాగునీటి సమస్యను తీర్చేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.330 కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం బుక్కాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీటీసీలు మునేశ్వర్‌రెడ్డి, నాగశేషు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, ఆర్ఎస్ రంగాపురం సర్పంచ్ గుమ్మగాల రాజు, నాయకులు బాబుల్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, గూని నాగరాజు, ఆకుల రమణ, రామనాయుడు, పిట్టల జాకీర్, బలరాముడు, నాయుడు, రమణ, సురేష్ మద్దయ్య, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు సగర్వంగా తెలపండి

- రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- 15వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

డోన్ : రాష్ట్రంలో నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సగర్వంగా తెలియజేయాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక గుత్తి రోడ్డులోని 15వ వార్డులో మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరంగా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలను తెలియజేసి, బ్రోచర్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు నవరత్న పథకాలన్నింటినీ అమలు చేశారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు విద్య, వైద్యం, గృహవసతి లాంటి అనేక సౌకర్యాలు ప్రజలకు కల్పించిన ఘనత దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న మంత్రి బుగ్గన

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వెంకటరెడ్డి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో జిల్లాలో ఏసీబీ ఎస్ఐగా పనిచేస్తున్న తిమ్మారెడ్డిని నియమించడంతో విధుల్లో చేరారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఆధార్ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. సోమవారం బెలుం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. విద్యార్థులు, గ్రామస్తులకు ఆధార్ నమోదు పత్రాలను అందజేశారు. కొత్తగా ఆధార్ నమోదుతో పాటు మార్పులు చేర్పులు చేసుకోవచ్చని చెప్పారు. ప్రజలు ఆధార్ కోసం ఎక్కడికీ వెళ్లకుండా ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే మొబైల్ ఆధార్ సేవలు అందిస్తుందన్నారు. అనంతరం బెలుంతో పాటు కొలిమిగుండ్ల 1, 2 గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తాహీర్ హుసేన్, పంచాయతీ సెక్రటరీలు సుబ్బయ్య, సుబ్బరాయుడు, పర్వేజ్, రవికుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు వెంకటాపురంలో సమాచార సేకరణ

డోన్ టౌన్: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద రీ సర్వేలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో మందస్తు రైతు సమాచార సేకరణ చేపడుతున్నట్లు గ్రామ సచివాలయ సర్వేయర్ ఉదయ్‌కిరణ్, వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 247, 248, 249–ఏ,బి, 250, 254, 255, 256, 257, 267, 268, 269–ఏ, బీ, 270, 271, 272 పొలాల్లో రైతుల వివరాలు సేకరించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత రైతులు ఉదయం 10 గంటలకు పాస్ బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు బీమా మేళా

డోన్ టౌన్: స్థానిక పోస్టాఫీసులో మంగళవారం బీమా మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అభిషేక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోస్టాఫీసులో ఇండియా పోస్ట్ పేమెంట్ ఖాతా కలిగిన వారు కేవలం రూ.299 లేదా రూ.399 చెల్లిస్తే ఒక సంవత్సరకాలానికి ప్రమాద బీమా రూ.10లక్షలకు ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయస్సు వారు దీనికి అర్హులన్నారు. డోన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ గరీబ్ బాషా తదితరులు ఉన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

డోన్ టౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాద రహిత ప్రయాణాలు సాగించవచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కొత్తబస్టాండ్ నుంచి షాదిఖానా వారకు ఆటో, బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది నాగభూషణం రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షకార్యదర్శులు వెంకటేశ్వర్లగౌడ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలబ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న శివస్వాములు

బేతంచెర్ల: నంద్యాల రహదారిలో వెలసిన బాలబ్రహ్మేశ్వర స్వామికి మాఘమాస తొలి సోమవారాన్ని పురస్కరించుకొని శివ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు, గురుస్వామి నారాయణ ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి గావించారు.

నేతాజీ ఆశయాలను సాధిద్దాం



కోవెలకుంట్ల హైస్కూల్‌లో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ తిమ్మారెడ్డి

కోవెలకుంట్ల: భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రాణత్యాగం చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మేజర్‌గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ బాలాంజనేయులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తిమ్మారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు, పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా నేతాజీ జయంతి

బనగానపల్లెరూరల్: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో విప్లవ జ్యోతి సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది మదన్‌మోహన్ రెడ్డి, శివ తదిరులు పాల్గొన్నారు.

ఆదర్శనేత సుభాష్ చంద్రబోస్

ప్యాపిలి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శనేత అని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌నాయక్ అన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సోమవారం సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ సుభాష్, మీడియా కన్వీనర్ మనోహర్, నాయకులు శేషనాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



క్రీడా సామగ్రి అందజేస్తున్న రామ్‌కో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రామ్‌కో సిమెంట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడా సామగ్రిని అందజేశారు. భవిష్యత్‌లో కళాశాల అభివృద్ధికి మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది రెడ్డి నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, రామ్‌కో జనరల్ మేనేజర్ రవికుమార్, కళాశాల సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్‌వే నిర్మించాలి

డోన్ టౌన్: మండలంలోని దొరపల్లె, లక్ష్మంపల్లె, మల్లెంపల్లె, బోంతిరాళ్ల గ్రామాలకు సబ్ వే, అండర్ పాస్ బ్రిడ్జి లేదా ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కేంద్ర కమ్యూనికేషన్ వ్యవహారాలశాఖ మంత్రి దేవాన్ష్ చౌహాన్‌ను కోరారు. సోమవారం కర్నూలులోని అతిథి గృహంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొత్తకాపు హేమ సుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె మహరాజ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పతకాలను చూపుతున్న విద్యార్థులు

డోన్ టౌన్: జాతీయ స్థాయిలో ఈనెల 22న గోవాలో జరిగిన కరాటే పోటీల్లో డోన్‌కు చెందిన రాయలసీమ కరాటే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు వివిధ స్థాయిలో ప్రతిభ కనభరచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ అఫ్రోజ్ సోమవారం తెలిపారు. ఇందులో కటా మరియు కుమిటీ ఈవెంట్‌లలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. మొత్తం 15 బంగారు పతకాలు, ఒక రజత పథకం సాధించినట్లు తెలిపారు. ఇందులో నుంచి 9మంది అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు వెళ్లనున్నట్లు వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

బనగానపల్లెరూరల్: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌లో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, వాహనం నడిపే సమయంలో మద్యం, మత్తు పదార్థాలను సేవించరాదన్నారు.

పట్టణ సీఐగా శేషయ్య



డోన్ రూరల్: పట్టణ సీఐగా పి.శేషయ్య సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న మల్లికార్జున వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో కర్నూలు నుంచి శేషయ్యను నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను సహించేదే లేదన్నారు. అలాగే పట్టణంలో ఉన్న అల్లరి మూకలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా, సారాను పూర్తిగా అరికడుతామన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం

డోన్ టౌన్: ఈ నెల 26వ తేదీ నుంచి పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వాడినా, ఫ్లెక్సీలు విక్రయించినా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ –16 చట్టం ప్రకారం శిక్షార్హులుగా గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాపార లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటీకరణ ఆపాలి

డోన్ రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, సీపీఐ ప్యాపిలి మండల కార్యదర్శి వెంకటేష్, డోన్ మండల కార్యదర్శి పులిశేఖర్ డిమాండ్‌చేశారు. సోమవారం ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. సుంకయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం 32మంది బలిదానం చేశారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దాని జోలికి వస్తే ఎంతటి వారినైనా ఎదురిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుగణమ్మ, ఎస్తేరమ్మ, జులేఖ, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ,

ఆలయాల జీర్ణోద్ధరణకు భూమిపూజ



ఆలయాల నిర్మాణ భూమిపూజకు హాజరైన కాటసాని ఓబుళరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో వెలసిన సోమేశ్వర, చెన్నకేశవ ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో ప్రభుత్వం రూ. 1.14 కోట్లు మంజూరు చేసింది. గ్రామ సర్పంచ్ దండె వెంకటసుబ్బమ్మ, దండే శేషిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబుళరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దండె వెంకట శేషిరెడ్డి సొంత నిధులు రూ.4 లక్షలు వెచ్చించి నిర్మించిన విశ్రాంతి సత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయాల ధర్మకర్త బ్రహ్మానందరెడ్డి, గ్రామ పెద్దలు ఏర్వ శేషిరెడ్డి, వెంగళరెడ్డి, బాల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పార్టీ అవుకు మండలాధ్యక్షుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, బాల మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, జోళదరాశి రాంమోహన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, కాంట్రాక్టర్ ప్రభాకర్‌రావు, రాంపుల్లారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీ సాయిబాబ గ్రామోత్సవం

బేతంచెర్ల: కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబ ఆలయం 15 వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం ఉదయం బాబాకు అభిషేకం, కుంకుమార్చన, సచ్చరిత్ర పారాయణం, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక అలంకరించిన రథంపై బాబావారి చిత్ర పటాన్ని ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కృపాధామ్ కమిటీ సభ్యులు బాబుల్ రెడ్డి, గుండా గోపాలు, వీరభద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ శెట్టి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బనగానపల్లె : బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ సూచించారు. సోమవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో జాతీయ బాలిక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు బేటి బచావో బేటి పఢావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధి కి ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సాహకలు అందించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు చిట్టెమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

డోన్ టౌన్: రైతులకు నకిలి విత్తనాలు నుంచి రక్షణ, పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 26న నంద్యాల పట్టణంలో ట్రాక్టరు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల గౌరవ అధ్యక్షుడు కొయిలకొండ నాగరాజు తెలిపారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విడుదల చేశారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగమద్దయ్య, వెంకట్రాముడు, కోశాధికారి సర్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మించాలి

బనగానపల్లె: కేంద్ర ప్రభుత్వం సిద్దేశ్వరం వద్ద కృష్ణనది పై ఏర్పాటు చేస్తున్న ఐకానిక్ బ్రిడ్జి స్థానంలో బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మించాలని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు సీమకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కృష్ణ నదిపై ఐకానిక్ తీగల బ్రిడ్జిని కేంద్రం నిర్మించేందుకు చర్యలు తీసుకుందని, ఇందుకు రూ.1,200 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అయితే బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌కు రూ.700 కోట్లు మాత్రమే అవుతుందన్నారు. ఈ నెల 28న నిర్వహించే ప్రదర్శకు రైతులు, విద్యార్థులు పెద్ద ఎత్తున్న సిద్దేశ్వరం చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరినాయుడు, గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం





కోవెలకుంట్లలో అమ్మవారి నిజరూప దర్శనం, బేతంచెర్లలో వాసవీమాతకు పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాలలో పట్టణ ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు అర్చకులు పవన్‌కుమార్ శర్మ, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త ఆధ్వర్యంలో108 పచ్చి నారికేళాలతో అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి గావించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాలు, కార్యదరి బచ్చు సుబ్రహ్మణ్యం, సభ్యులు కందగడ్డల మోహన్‌రావు, శేషఫణి,స ముద్రాల మద్దిలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పంచసూక్త హోమం, కుంకుమార్చన, ఆర్యవైశ్య మహిళలు దీపాలంకరణతో ఊరేగింపు, గంధంతో చేసిన 12 అడుగుల ఎత్తుగల అమ్మవారి నిజరూప దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక జీవనం అలవర్చుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితం అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని బిరవోలు గ్రామంలోని శ్రీరామాలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రిటైర్డ్ తెలుగు పండితులు సుబ్బలక్ష్మమ్మచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగద్గీతపై ప్రవచనాలు ఉంటాయన్నారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్సంగ సభ్యులు ఎం.మోహన్‌రెడ్డి, శ్రీరాములు, టి.పుల్లయ్య, బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.